క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేస్తా

- జేసీఎస్ జిల్లా కన్వీనర్ గోవిందు



నక్కపల్లి : గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకునేందుకు కృషి చేస్తానని జిల్లా జేసీఎస్ కన్వీనర్‌గా నియమితులైన సూరాకాసుల గోవిందు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తన సేవలను గుర్తించి జేసీఎస్ జిల్లా కన్వీనర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించేందుకు తాను కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న బంగారయ్య

ఎస్.రాయవరం : ప్రతి పేదవాడు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని పాయకరావుపేట కేజీహెచ్ మాజీ ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డు బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తాను ఉచితంగా ప్రతి ఆదివారం అడ్డురోడ్డు ప్రజా వైద్యశాలలో వైద్య పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు అన్న సమారాధన

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం పురస్కరించుకుని నిర్వహించాల్సిన అన్న సమారాధన కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. కల్యాణోత్సవాలు చివరిలో మిచాంగ్ తుపాను రావడంతో అన్న సంతర్పణ వాయిదా వేశారు. ఈ మేరకు భారీ ఎత్తున ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

కొండకర్లలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



కొండకర్లలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల సచివాలయం వద్ద ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కోట్ని శివ, బీజేపీ నేతలు గొంతిన భక్త సాయిరాం, అగ్గాల హనుమంతరావు, రాజాన సన్యాసినాయుడు, పట్టాభి ప్రసాద్, ముత్యాల అప్పారావు,నాయుడు బాబు, ఎంపీటీసీ శ్రీనివాస్, ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

350 మందికి ఉచిత కంటి పరీక్షలు



బ్రాండిక్స్‌లో కంటి శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 117వ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి 237 మందికి కళ్లద్దాలు అందజేశారు.109 మందికి ఉచితంగా మందులు అందజేశారు.40 మందిని కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు.శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సౌకర్యం కల్పించారు. కంటి వైద్య శిబిరాన్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరిశీలించి కంటి బాధితులతో మాట్లాడారు.

కోట సత్తెమ్మతల్లి పండగ

నాతవరం: డి.యర్రవరంలో కోట సత్తెమ్మ తల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, రవికె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి సమీపంలో కొండపై అమ్మవారి ఆలయం వద్ద సంహపంక్తి భోజనాలు చేశారు.

సొంతింటి కల నెరవేరింది...



మాది దేవవరం పేద కుటుంబం, ఒకే ఇంట్లో రెండు కుటుంబాల వారు నివసించేవాళ్లం. సొంతంగా ఇల్లు కట్టుకోగలమా..? అనే బెంగ ఉండేది. ఎన్నాళ్లు ఇలా ఇరుకు ఇంట్లో ఉండాలి అని బాధపడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకోడానికి ఆర్థిక సాయం ఇవ్వ డంతో ఇళ్ల నిర్మాణపు పనులు ప్రారంభించాం. దాదాపు పూర్తికావచ్చాయి. సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే.

– జి.కనకలక్ష్మి, లబ్ధిదారు, దేవవరం

అద్దె ఇంటి భారం తప్పింది...



నాది పాయకరావుపేట. మాకు సొంత ఇల్లు లేదు. అద్దెంట్లో ఉండేవాళ్లం. నెలనెలా అద్దెకట్టడం భారంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీఎల్‌పురం వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మాకు స్థలం కేటాయించారు. పక్కా గృహాన్ని కూడా మంజూరు చేశారు. సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేయడంతో పాటు బిల్లులు కూడా ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. గృహ ప్రవేశం చేసుకుని నివాసం ఉంటున్నాం. జగనన్న దయ వల్ల మాకు సొంత ఇంటి కల నెరవేరింది.

– అచ్యుత వేణి, పాయకరావుపేట

సొంత గూడు జగనన్న చలవే



మా లాంటి పేదవాళ్ల స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకోలగమా.. అనే ఎప్పుడూ అనుకునే వాళ్లం. మా కల నెరవేరుతుందా అని బాధపడేవాళ్లం. జగనన్న దయ వల్ల మా కల నెరవేరింది. పాయకరావుపేటకు చెందిన మాకు పీఎల్ పురం వద్ద సుమారు ఐదు లక్షలు విలువ చేసే స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఇల్లు కట్టుకోడానికి సిమెంట్, ఇనుము, ఇసుకతో పాటు, డబ్బులు కూడా ఇచ్చారు. ఇళ్లు నిర్మించుకంటున్నాం. దాదాపు పూర్తయింది. మా కాలనీలో మాతో పాటు స్థలాలు పొందిన వారిలో చాలా మంది పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేసుకున్నారు. ఇదంతా జగనన్న చలవే.

– గౌరీజు దేవి, పీఎల్‌పురం

ఆనంద నిలయాలు



ఇది కదా అభివృద్ధి

పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల వివరాలిలా...

మండలం	లేఅవుట్లు	లబ్ధిదారుల సంఖ్య
నక్కపల్లి	36	2853
పాయకరావుపేట	20	2964
ఎస్‌రాయవరం	44	2080
కోటవుటర్ల	43	1279

- ఊరూరా జగనన్న కాలనీలు
- ప్రతి పేదవాడికి ఉచితంగా ఇంటి స్థలం
- ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం
- రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇళ్ల స్థలాల పంపిణీ



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



పాయకరావుపేట మండలం పీఎల్‌పురం వద్ద మెగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

నక్కపల్లి/పాయకరావుపేట : పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం మంజూరు చేసింది. గ్రామాల్లో ప్రభుత్వ, జిరాయితీ భూములను సేకరించి ప్రత్యేకంగా లేఅవుట్లు వేసి సెంటున్నర స్థలాన్ని కేటాయించింది. స్థలాలు పొందిన వారందరికీ పక్కా గృహం మంజూరు చేయడంతో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల ఇళ్ల స్థలాలు ఒకే విడతలో పంపిణీ చేసింది. పాయకరావుపేట మండలం పీఎల్‌పురం వద్ద 42 ఎకరాల్లో మెగాలే అవుట్ ఏర్పాటు చేసి ఒకే చోట 1450 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వడం చెప్పుకోదగ్గ విషయం. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇళ్ల పట్టా అందజేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేయడం జగనన్న ప్రభుత్వం ఘనత. సగటున రూ.2 లక్షల నుంచి ఐదు లక్షల విలువైన స్థలాన్ని జగనన్న ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసింది. ఒకే చోట లేఅవుట్లు ఏర్పాటు చేసి రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్, తాగునీరు, వాడుక నీరు సదుపాయాలు కల్పించడంతో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.1.85 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం కింద అందిస్తోంది. దీంతో కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. చాలా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు కూడా జరుపుకోవడం విశేషం. కాలనీలు కాస్తా జగన్మోహనపురాలుగా మారుతున్నాయి.

సందడిగా కార్తీక వన సమారాధనలు



మునగపాక పరదేశిమాంబ గుడి వద్ద ఒకే చోట చేరిన 1983-84 మునగపాక హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు



రేవుపోలవరం తీరంలో పర్యాటకుల సందడి

మునగపాక(అనకాపల్లి): కార్తీక మాస సందడితో స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆదివారం గడిపారు. మునగపాక మండలంలోని సిరసపల్లి వీరభద్రస్వామి గుడి మునగపాక గ్రామానికి చెందిన సూరిశెట్టి పాలి సంఘం సభ్యులు సందడి చేశారు. మూడు తరాలకు చెందిన కుటుంబీకులతో పిల్ల, పాపలతో ఆడుతూ సరదాగా గడిపారు. ఉమ్మడి కుటుంబ మాధుర్యాన్ని ఆస్వాదించారు. ఒకే చోట భోజనం చేసి రోజంతా అక్కడే గడిపారు. మునగపాక పరదేశిమాంబ అమ్మవారి గుడి వద్ద 1983–84 మునగపాక హైస్కూల్ బ్యాచ్ విద్యార్థులు కార్తీక మాస వనసమారాధనలో పాల్గొన్నారు. 55 ఏళ్ల పైబడి వయసుకు చేరిన వీరంతా చిననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల వయసులో చేసిన అల్లరిని గుర్తు చేసుకొన్నారు. పొలిమేర సాంబశివరావు, బి.పద్మకృష్ణ,ఆడారి దేవకి తదితరులు పాల్గొన్నారు. మునగపాక త్రిమూర్తులు వారి గుడి వద్ద యల్లపు కుటుంబీకులు సందడి చేశారు. వాడ్రాపల్లి దక్షిణ కాశీశ్వర స్వామి గుడికి, వాడ్రాపల్లి ఆవకు పిక్నిక్ ప్రియులు పోటెత్తారు.



సిరసపల్లి వీరభద్రస్వామి గుడి వద్ద వన సమారాధనలో పాల్గొన్న సూరిశెట్టి పాలి సంఘం సభ్యులు

రేవు పోలవరం తీరంలో...

ఎస్.రాయవరం : కార్తీక మాసం కావడంతో రేవుపోలవరం తీరంలో పిక్నిక్ పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ప్రతి ఏడాది కార్తిక మాసంలో అధిక సంఖ్యలో రేవుపోలవరం తీరానికి తెలిసిందే. అయితే అదే క్రమంలో ఈ ఆదివారం కూడా పర్యాటకులు తీరానికి వచ్చి సందడి చేశారు. తీరం తోటల్లో మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు ఆచరించారు. మధ్యాహ్నం నుంచి తీరం ఇసుక తిన్నెల్లో ఆటపాటల్లో మునిగి తేలారు.

నాలుగు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక

ఉపమాకలో పూర్వ విద్యార్థుల సమావేశం



ఉపమాకలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదవిన పూర్వ విద్యార్థులు 46 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 1976–77 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అపూర్వ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరంతా నాటి బాల్య స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార తదితర రంగాల్లో స్థిరపడిన వారు కొందరైతే, ఉద్యోగాల్లో పదవీ విరమణ చేసిన వారు మరికొందరు. వారంతా ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్య నభ్యసించిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సమావేశంలో ఎస్.వి.ఆర్ గోపాలాచార్యులు, డి.వి. రామారావు, ఎస్.వెంకటాద్రి, పి.నూకయ్యశెట్టి, ఎం. రమణ, ఎ.సత్యనారాయణ, మదీనావల్లి, అబ్దుల్ అజీమ్, ఎ.రాధిక పాల్గొన్నారు.

నేటి నుంచి పంట నష్టం నమోదు

రాంబిల్లి : మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న వరి పంటను సోమవారం నుంచి పరిశీలించి సంబంధిత రైతుల వివరాలను నమోదు చేయడం జరుగుతుందని ఏవో సి. సుమంత తెలిపారు. వ్యవసాయం, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చినపుడు రైతులు తమ తమ దెబ్బతిన్న వరి పంటను చూపించి సంబంధిత భూమి వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతాలకు సంబంధించి జెరాక్స్ పత్రాలను అందజేయాలని ఏవో సూచించారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పంట నమోదు చేయడం జరుగుతుందన్నారు.

గంటవానిపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్



గంటవానిపాలెంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

మునగపాక (అనకాపల్లి): మునగపాక మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆడారి అచ్చింనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సీఎంగా జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ఎన్నుకుంటే అమలు చేయనున్న(కొనసాగనున్న) పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులు ఈ విషయంలో వాస్తవాలను అర్థం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందుతున్న వారికి అంతా తెలుసునని, సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ పొలిమేర పూర్ణ చంద్రగణేశ్, మాజీ సర్పంచ్ అరిగా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సేనాపతి వెంకయ్యనాయుడు, అప్పికొండ రమణ, సత్యవతమ్మ, కన్నబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం



వెల్చూరులో నాగ లింగేశ్వరస్వామి సన్నిధిలో పూజల్లో భక్తులు



నాగలింగేశ్వర స్వామి

రాంబిల్లి : వెల్చూరులో నాగలింగేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. లక్ష పత్రి పూజ, రుద్ర హోమం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో సుధీర్, ప్రసాద్, రాజన్‌రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిదెల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో ప్రైవేటు వ్యాపారం

- అక్రమంగా ఇసుక బట్టీ నిర్వహణ
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



ఆవ సోమవరంలో ఖాళీ స్థలంలో ఇటుక బట్టీ నడుపుతున్న లే-అవుట్ నమూనా



ఇటుక బట్టీ



జూన్ 16న ఈవోఆర్‌డీకి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నివేదిక

అచ్యుతాపురం(అనకాపల్లి): పదేళ్లకు పైగా పంచాయతీకి చెందిన భూమిలో ప్రైవేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. పంచాయతీ స్థలంలో వ్యాపారం చేసుకుంటూ నాలుగు కాసులు వెనకేసుకుంటున్న వ్యాపారులు మాత్రం అటు పంచాయితీకి గానీ, ఇటు ప్రభుత్వానికి గానీ పైసా చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. సుమారు ఐదు లక్షల రూపాయలకు పైబడి ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారుల నుంచి వసూలు చేస్తుండడం ఒక ఎత్తయితే పంచాయతీ అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం గమనార్హం. స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే...

అచ్యుతాపురం మండలంలో ఆవసోమవరం పంచాయతీ పరిధిలో 2012లో ఆరు ఎకరాల విస్తీర్ణంలో లే-అవుట్ వేశారు. సదరు లే-అవుట్‌కి సంబంధించి 60 సెంట్ల స్థలాన్ని ఓపెన్ స్పేస్ కింద పంచాయతీకి అనధికారికంగా అప్పగించారు. అయితే పంచాయతీకి ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయించకపోవడాన్ని దళారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అరవై సెంట్ల లే-అవుట్ ఓపెన్ స్పేస్ మీదుగా ఒక విద్యుత్ టవర్ వెళుతోంది. 2012 నుంచి ఈ అరవై సెంట్ల స్థలంలోని 22 సెంట్ల విస్తీర్ణంలో ఒక బ్రిక్ ఇండస్ట్రీని నిర్వహిస్తున్నారు. నిజానికి సదరు స్థలం పంచాయితీకి లే-అవుట్ నిబంధనల ప్రకారం దఖలు పడినట్లే. అచ్యుతాపురం-గాజువాక రహదారికి ఆనుకొని ఉండడంతో ఈ స్థలంలో వ్యాపారులు యథేచ్ఛగా తమ పని చేసుకుంటూ పోతున్నారు. పంచాయతీకి పైసా చెల్లించకుండా ఆ స్థలంలో వ్యాపారం చేసుకుంటున్నారు.

ఫిర్యాదు బుట్టదాఖలు

22 సెంట్ల స్థలంలో ఉన్న ఇటుక బట్టీ విషయమై జూన్ 16న స్పందనలో ఫిర్యాదు వచ్చింది. దీనికి గానూ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం బట్టీ రెండు చేతులు మారి మూడో వ్యక్తి ఆధ్వర్యంలో నడుస్తోంది. స్థలం ఎవరిదో చెప్పలేకపోతున్న సదరు యజమాని ఒక వ్యక్తికి మాత్రం ఏడాదికి రూ.55 వేల చప్పున అద్దె చెల్లిస్తున్నట్టు సాక్షికి చెప్పడం గమనార్హం. పదేళ్లకు పైగా గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఇటుక బట్టీ అంశంలో పలువురికి మామూళ్లు అందుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం...

ఈ అంశంపై ఆవ సోమవరం పంచాయతీ కార్యదర్శి శ్యామలను వివరణ కోరగా గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు నోటీసులు ఇచ్చామని, అవసరమైతే మళ్లీ నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. సదరు లే-అవుట్ ఖాళీ స్థలాన్ని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయలేదని అన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



రామాలయంలో పంపిణీకి సిద్ధంగా వున్న అక్షింతలు

పాయకరావుపేట : అయోధ్యలో శ్రీరామునికి పూజలు చేసిన అక్షింతలను సోమవారం గ్రామాలకు తరలించడం జరుగుతుందని వికాస తరంగణి ప్రతినిధి చిక్కాల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో గల సీతారాముని ఆలయంలో భద్రపర్చిన అక్షింతలను పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో గల 130 గ్రామాలకు తరలించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో గల ప్రతి హిందూ కుటుంబాలకు అక్షింతలు అందించడం జరుగుతుందన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం

కె.కోటపాడు: చౌడువాడలోని గవరపేటలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తుల అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గవరపేట రామాలయం నుంచి గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆ సమయంలో మహిళల, చిన్నారుల కోలాటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామ శివారు శారదానదిలో నిమజ్జనం చేశారు.

దార్లపూడిలో పూర్వ విద్యార్థుల సమావేశం



దార్లపూడి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : దార్లపూడి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆనందకర వాతావరణాన్ని కలిగించింది. పాఠశాలలో 2002–03 సంవత్సరాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం కుటుంబ సమేతంగా పాఠశాలకు చేరుకుని సందడి చేశారు. అలనాటి తీపి గుర్తులు నెమరుకున్నారు. సుమారు 20 ఏళ్ల తరువాత కలుసుకున్న ఈ విద్యార్థులు ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు బోధన జరిపిన ఉపాధ్యాయులు బి.కాశీవిశ్వనాథం, భాస్కరరావులను ఘనంగా సత్కరించారు.